కథ

# బాసుమతి

- వసుంధర

''తలుపు లోపల్నించీ లాక్ చేసావ్ కదా!'' అని బాస్ అంటే ''ఊఁ'' అంది మాధవి.

''ఐతే ఇక బట్టలు విప్పు'' అని బాస్ అంటే ''ఛీ- ఇది పట్టపగలు...'' అంది మాధవి.


''పట్ట పగలైతేనేం- గది లోపలున్నది మనమిద్దరమే కదా!''

''ఐనా బయట జనమున్నప్పుడు- కొన్నింటికి సమయాసమయాలుంటాయి''

''కొన్నింటికంటే- నీ ఉద్దేశ్యమేమిటో కానీ- నేను మాత్రం ఫొటోకోసం అడిగాను''

''రాజుగారి భుజంమీద చెయ్యేసిన విదూషకుడు- అదేమంటే రాణిగారనుకున్నానని సంజాయిషీ ఇచ్చేట్ట. అలాంటి ఫొటోలకి ఏ మోడల్నో పిల్చుకోండి''

''అయ్యో- తప్పుగా అర్థం చేసుకున్నావ్. ఇది చూడు'' అని బాస్ అంటూండగా ఏదో ప్యాకెట్ విప్పుతున్న చప్పుడు. అంతలోనే, ''అరే- అనార్కలీ డ్రస్సు. అదీ నాకిష్టమైన ఆకాశం రంగులో...'' అంటూ ఆమె గొంతులో పట్టరాని ఆనందం.



''వేసుకున్నది విప్పు. ఇచ్చింది వేసుకో. నీదో ఫొటో తీసుకుని ధన్యుణ్ణౌతాను''

''ఊc ఈ విషయం ముందే చెప్పొచ్చుగా, హడలగొట్టి చంపారు...''

''నాకు నువ్వంటే ఎంత ప్రేమో అంత గౌరవం. అది తెలిసి కూడా నువ్వు అనవసరంగా అనుమానిస్తూంటావ్. ఊc క్విక్. ఇంకో పది నిముషాల్లో నాకు మిస్టర్ ప్రకాష్‌తో అపాయింట్‌మెంటుంది...''

క్షణం నిశ్శబ్దం తర్వాత, ''వావ్- వాటే బ్యూటీ! నాకు నిన్నిలాగే చూస్తూ ఉండిపోవాలనుంది. ఫొటో కాసేపాగి తీసుకుంటాను...'' అంటూ బాస్ అభినందన.

''మరి- మిస్టర్ ప్రకాష్‌తో అపాయింట్‌మెంట్...?'' ఆమె గొంతులో చిలిపితనం.

''ఆ ప్రోబ్లం నీది కాదు, నాది'' బాస్ గొంతులో ఉత్కంఠ తర్వాత మళ్ళీ ఒక్క క్షణం నిశ్శబ్దం.

***

ఇయర్ ఫోన్ తీసి బల్లమీద పెట్టి భారంగా నిట్టూర్చాను. అవతల బాస్ గదిలో- ఆయన పెర్సనల్ సెక్రటరీ మాధవిని ఊహించుకుంటే, ''అదృష్టమంటే బాస్‌దే'' అనిపించింది. వళ్ళు వేడెక్కింది.

నేను ఎమ్మే. బాస్ బియ్యే. నా ఎత్తు ఐదడుగుల పదంగుళాలు. ఆయన నాకంటే ఆరంగుళాలు పొట్టి. నాది ఒత్తైన క్రాపు. ఆయనది బట్టతల. నాది పసిడి ఛాయ. ఆయనది శ్యామల వర్ణం. సిక్స్ ప్యాక్ లేకపోయినా టెన్నిస్ ప్లేయర్ పెర్సనాలిటీ నాది. ఊపిరి బిగబట్టినా ఇంకా ఉన్నాననిపించే బొజ్జ ఆయనది. ఆయన వయసు ముప్ఫైఐదు. నాది ముప్ఫై లోపే. ఆయనెప్పుడో వివాహితుడు. నేనింకా బ్రహ్మచారిని.

అదేమిటో మరి- మా ఆఫీసులో పనిచేసే పెళ్ళి కాని అమ్మాయిలు నన్ను కన్నెత్తైనా చూడరు. బాస్ కేమో- పెళ్ళై రెండేళ్ళైనా స్క్రీన్ టెస్టుకి ఒకరోజు ముందు ఎలియానాలా ఉండే మాధవిని- పెళ్ళైందన్న గౌరవభావంవల్ల- నేనెప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. బాస్ ఇలాకా అన్న ప్రచారమున్నా- అందమైన పెర్సనల్ సెక్రటరీలపై అలాంటి పుకార్లతో బురద జల్లడం మామూలే అని ఏవగించానే తప్ప ఆమెని అనుమానించలేదు. కానీ ఈరోజు అనుకోకుండా మాధవి గుట్టు రట్టయింది నా దగ్గిర.

ఈరోజు ఆఫీసులో వేరే క్యాబిన్లోకి షిఫ్టయ్యాను. అది ఒకప్పుడు బాస్ భార్య క్యాబిన్. మూణ్ణెల్లక్రితం ఆమె ఉద్యోగం రిజైన్ చేసిందిట. ఆమెకిచ్చినంత జీతం ఇవ్వకపోయినా, ఆ ఖాళీలోనే నన్ను తీసుకున్నారు. డ్యూటీలు అవే ఐనా క్యాబిన్ మాత్రం ఇప్పుడిచ్చారు. ఓ డ్రాయర్ సొరుగులో కాగితాలకింద మూలగా కనిపించింది నాకో ఇయర్‌ఫోన్. అది చెవిలో పెట్టుకుంటే ఆశ్చర్యంగా బాస్ గదిలో మాటలు స్పష్టంగా వినిపించాయి. అంటే- బాస్ భార్య ఆయన్ని బగ్ చేసేదన్న మాట! అందుకే ఉద్యోగం రిజైన్ చేసిందేమో!

ఆమె విషయమలాగుంచితే- దారితప్పిన మాధవిపై నా గౌరవభావం తొలగింది. కానీ అదేమిటో- ఆమెకి దూరంగా ఉండాలనుకోవడానికి బదులు- తప్పిన దారిలో ఎదురుపడి ఆమెకి దగ్గిరయ్యే అవకాశం గురించి ఆలోచిస్తున్నాను. అదీ నా ఉద్యోగానికి ప్రమాదం వాటిల్లకుండా!

అలాగని నా ఉద్యోగం గొప్పదేం కాదు. కానీ- చదువుకుంటున్న తమ్ముడు, పెళ్ళి కావాల్సిన చెల్లి, నావల్ల కుటుంబం హోదా మారుతుందని నమ్మే అమ్మ, వారసత్వపు బాధ్యతల్నించి సంక్రమించిన అప్పులు తీరే లోగానే రిటైరు కాబోయే నాన్న- నా నేపథ్యం. నా నెల జీతం ఏడు వేలు. మున్ముందు ఇంకా పెద్ద ఉద్యోగం వస్తుందని ఇంట్లో ఆశ. ఈ ఉద్యోగం పోతే ఏమైపోతానా అని నా బెంగ.

ఈ ఉద్యోగంలో కొత్తగా నేర్చుకుని పైకొచ్చే అవకాశాలూ తక్కువే. అటెండర్ని కాదు కానీ పిల్చినప్పుడల్లా బాస్ గదికి వెళ్ళాలి. ఆయనిచ్చిన కాగితాలు చదివి డ్రాఫ్టింగ్ సరిచేసి కంప్యూటర్లో ఎక్కించాలి. ఆయన ఓకే చేసాక చెప్పిన అడ్రసులకి ఈ మెయిల్స్ పంపాలి. బాస్‌కి పెర్సనల్ కంప్యూటరు ఆపరేటర్ని నేను.

ఇలాంటి నన్ను కూడా పెళ్ళాడాలని క్యూ కట్టిన అమ్మాయిలు లేకపోలేదు. కానీ నా పెళ్ళితో మా కరువు శాశ్వతంగా తీరిపోవాలన్న మా ఇంట్లోవాళ్ళ ఆశవల్ల- నాకింకా పెళ్ళి కాలేదు. ఔతుందన్న ఆశ దగ్గిర్లో లేదు. పెళ్ళి కాకున్నా ఆడది కావాలని ఆత్రపెడుతోంది- ఇరవై ఎనిమిదేళ్ళ నా వయసు. అమ్మాయిలెవరైనా మోజుపడి వెంటపడాలే తప్ప నాకు నేనుగా చొరవచేసే తత్వం కాదు నాది. కానీ రూప సౌందర్యాల్లేని బాస్ పెళ్ళయ్యేక కూడా అమ్మాయిల్ని ఆకర్షిస్తున్నాడు. నేనాకర్షించలేకపోతున్నాను.

''ఆడది మగాడిలో కోరేది అందం కాదు. ధోనీలా క్రికెట్టాడాలి. రెడీ రామ్‌లా యాక్టింగ్ చేయాలి. నీ బాస్‌కిలా పొజిషనుండాలి. ఇవేం లేకుంటే డబ్బు.... డబ్బు వెదజల్లాలి. ఒడ్డూ పొడవూ ఉండి ఎర్రగా బుర్రగా ఉన్నా- దరిద్రమంతా నీ ముఖంలో ప్రతిఫలిస్తుంటే అమ్మాయిలు నిన్ను చూసి పారిపోరా?'' అంటాడు ప్రతాప్. వాడు నా స్నేహితుడు, నాకంటే చిరుద్యోగి. డబ్బూ, హోదా రెండూ లేకపోయినా- సద్దుబాటు గుణంతో మూడేళ్ళక్రితం తనలాంటి మరో చిరుద్యోగిని పెళ్ళాడాడు. భవిష్యత్తుకంటే వర్తమానమే ముఖ్యమనుకుని- బతుకు సమరంలో సైనికుడై- తీరిక సమయంలో సంతోషంగా ఉంటున్నాడు.

భవిష్యత్తే ప్రధానమనుకున్న నా వర్తమానంలోకి మాధవి వస్తుందా? భర్త ఉన్న మాధవి- పెళ్ళైన బాస్‌కి ఇలాకా ఐనప్పుడు- పెళ్ళికాని నాకూ ఇలాకా ఎందుక్కాకూడదని మనసు ప్రోత్సహిస్తోంది. వయసు తొందరపెడుతోంది. వివేకం హెచ్చరిస్తోంది. అప్పుడే ఇయర్ ఫోన్లో బాస్ మిత్రుడు ప్రకాష్ మాట వినిపించింది.

***

''నా సెక్రటరీ రాధ స్ట్రక్చర్ గొప్పది. నీ మాధవికున్న అందం లేకపోయినా ఏదో అట్రాక్షన్. ఆర్నెల్ల నించి ట్రై చేస్తున్నా ఇంకా లైన్లోకి రాలేదు. ఉద్యోగం లోంచి తీసేస్తానని బెదిరించినా లొంగడంలేదు. తీసేద్దామంటే- తను ఎప్పటికీ నాకు దక్కని వెలితి ఉండిపోతుంది. అదీ నా డైలమా...'' ప్రకాష్ నిట్టూర్పు.

''మగాడు బలంతో చంపితే, ఆడది అందంతో చంపుతుంది. ఆడాళ్ళని వెంటాడాలే తప్ప, వేటాడకూడదు''

''చద్దన్నం తిన్నమ్మ మొగుడాకలెరుగదు. మాధవి దక్కిందిగా, నీకు నా బాధ అర్థంకాదు''

''అమ్మాయికి వయసు అందం. ఆ అందం అబ్బాయిల్ని చుట్టూ తిప్పుకుని అమ్మాయి అహం పెంచుతుంది. పెళ్ళయ్యేక చాలా మంది అమ్మాయిలు భర్త అహానికి తలొంచాల్సొస్తుంది. అలాంటివాళ్ళని గుర్తించి వెంటపడాలి. దెబ్బతిన్న వాళ్ళ అహాన్ని తృప్తిపర్చడానికి పొగడ్తలు గుప్పించి సహనంతో ఎదురు చూడాలి. అహం చంపుకుని, సహనంతో ఎదురుచూస్తే వాళ్ళు లైన్లోకి రావడం గ్యారంటీ'' ఇదీ బాస్ ఉపదేశం.

''నేను మాధవిని లైన్లో పెట్టానంటే మొదటి కారణం- ఆమె వివాహిత. రెండోది- భర్త ఆమె అహాన్ని దెబ్బతీయడం'' అదీ బాస్ విజయరహస్యం.

''అంటే ఏ పరాయి మగాడికైనా పెళ్ళైన ఆడది పడిపోవడం ఈజీ అంటావ్'' ప్రకాష్ అపనమ్మకం.

''రంజీ ట్రోఫీలో సెంచరీ కొట్టు. నేషనల్ క్రికెట్ జట్టులో ఛాన్సుంటుంది. అమ్మాయిని లైన్లో పెట్టాలంటే- ముందు అబ్బాయికి అందమో, డబ్బో, హోదాయో ఉండాలి. అర్హతల్లో నువ్వూ నేనూ ఒకటే కాబట్టి- నీకు నాదో సలహా. మీ ఆఫీసులో వసుధ, రాధకంటే అందగత్తె. ఆమె భర్త పెద్ద శాడిస్టని విన్నాను. నువ్విప్పుడు రాధని వసుధ పొజిషన్‌కి దింపేసేయ్. వసుధని పెర్సనల్ సెక్రటరీగా ఎలివేట్ చేయి. నా ట్రిక్స్ మొదలెట్టు. వసుధ లైన్లోకి రావడమే కాదు- వసుధ ప్రాముఖ్యం ఆఫీసులో పెరిగిపోతుంటే- అన్నాళ్ళూ ఆ హోదా అనుభవించిన రాధ అనామకురాలిగా కొనసాగలేక- తనూ నీ దారికి రావచ్చు'' బాస్ సలహా.

''అందరు భర్తలూ శాడిస్టులైనా, అందరాడవాళ్ళూ మాధవి కాలేరు. వసుధ నిప్పు. దగ్గిరకెడితే తాకాలనిపించదు. చేతులు జోడించాలనిపిస్తుంది. ఐనా నువ్వింతలా చెబుతున్నావ్ కాబట్టి- నీ ఉపాయం జయంతి మీద ప్రయోగిస్తా. సక్సెసయిందో మంచి మందుపార్టీ నీకు'' ప్రకాష్ హామీ.

***

ఆ సంభాషణ ప్రభావం నా ఆలోచనల్ని మార్చేసింది. మా బాస్‌కి, ఆయనతోపాటు నాకూ- నెలకి రెండుసార్లైనా ఏదో పార్టీకి పిలుపొస్తుంది. కానీ ఈ మూణ్ణెల్లలోనూ ఒక్క పార్టీకే వెళ్ళాను. నేను పార్టీలకి వ్యతిరేకిని కాదు. అక్కడ ఐటమ్స్‌లో బాసుమతి బియ్యంతో చేసిన వెజిటబుల్ పులావ్ నాకెంతో ఇష్టం. బాసుమతి బియ్యం ఖరీదనే కాదు, దాని పరిమళం మాఇంట్లో మిగతావాళ్ళకి నచ్చదు. కేవలం బాసుమతి కోసమైనా పార్టీలకి వెళ్ళాలనిపిస్తుంది నాకు. కానీ అక్కడ చేసే మిగతా వంటకాలు మావాళ్ళు మిస్సౌతున్నారన్న గిల్టీ ఫీలింగూ, పార్టీలో మిగతావాళ్ళముందు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు- నన్నాపుతున్నాయి.

ఇప్పుడు తెలియకుండా బాస్ నాకిచ్చిన ఉపదేశం నాలో కొత్త ఉత్సాహం నింపింది. నేను పార్టీకి వెడితే అక్కడ ఓ భర్తబాధితురాలు తటస్థపడితే- ఆమె అనుగ్రహానికి నా పెర్సనాలిటీ- ట్వంటీ ట్వంటీ క్రికెట్లో యూసుఫ్ పఠాన్ పెర్ఫార్మెన్స్‌లా- సహకరిస్తుంది. ఈ చిట్కా ముందే తెలిసుంటే ఎంత బాగుండేది?

***

పెద్ద హాలు. ఖరీదైన అలంకరణ. కృత్రిమమైన ఆదరణ. ఎందరో గొప్పవాళ్ళు. వాళ్ళమధ్య నేను.

ఉన్నంతలో ట్రిమ్‌గా తయారై పార్టీకి వెళ్ళాను. అప్పటికే బాస్ అక్కడున్నాడు. నన్ను చూసి కూడా

పలకరించపోయినా– బాస్ దగ్గిర అభిమానం కూడదని– నేనే పనికట్టుకుని విష్ చేసాను. ఆయన ముఖంలో నా వినయానికి సంతోషం, హోదాపట్ల నిర్లక్ష్యం ఒకేసారి తమాషాగా కలిసాయి. పక్కనున్న అమ్మాయిని భార్యగా నాకు పరిచయం చెయ్యలేదు. పైగా సీత పక్కన రాముడిలా అన్యోన్యతని ప్రదర్శిస్తున్నాడు. ఆమె ముఖభావాల్ని పరీక్షగా చూడాలన్న కుతూహలం వేధించింది. కానీ భయం, సంకోచం– కొంతవరకే సహకరించగా– మాధవి కాదని గుర్తించే మేరకు మాత్రమే నేనామెని చూడగలిగాను.

బాస్ నిరాసక్తత నాకో మంచి అవకాశం. నా కళ్ళు మాధవిలాంటి అమ్మాయికోసం వెదుకుతుంటే– ఒక మూల కుర్చీలో కూర్చుని ఒంటరిగా లెమన్ జ్యూస్ తాగుతున్న ఒకామె కనిపించింది. అందంగా ఆకర్షణీయంగా ఉన్న ఆమె దగ్గిరకి అదృష్టాన్ని పరీక్షించుకుందామని వెళ్ళాను.

ఆలికిడికి తలెత్తి చూసిందామె. నేను చప్పున, ''మీతో మాట్లాడొచ్చా?'' అన్నాను.

ఆమె నవ్వింది. ఆ నవ్వుల వెలుగు మెడదాకా ప్రసరించి– నల్ల పూసలతో కలిసి– చీకటి వెలుగుల వింత సమ్మేళనమైంది. ''కూర్చోండి'' అందామె. ఆ గొంతులో సంగీతం. పలుకులో గాంభీర్యం. మనిషిలో రాజసం. ఐనా సంకోచించకుండా ఓ కుర్చీ లాక్కుని ఆమె ఎదుట కూర్చుని, ''వెన్నెల్లో తాజమహల్ చూడాలని కొందరి కోరిక. రవివర్మ చిత్రాలు చూడాలని కొందరి కోరిక. అభిమాన తారతో మాట్లాడాలని కొందరి కోరిక. ఇన్ని కోరికలూ ఒక్కసారి తీరినట్లైంది నాకు– మీతో మాట్లాడ్డానికి మీరు అనుమతించగానే!'' అన్నాను.

పొగడ్తలకి ఆమె బుగ్గలపై గులాబి జీరలు. ''ఏం మాట్లాడాలనుకుంటున్నారు?'' అందామె. నేనామె రూపాన్నీ, రాజసాన్నీ, గొంతునీ, నవ్వునీ పొగిడితే, ''మీ గురించి చెప్పండి'' అందామె మృదువుగా.

''మీ గురించి ఆడంబరంగా చెప్పానంటే అది సహజం. నా గురించి ఏం చెప్పను, నేను అల్పుణ్ణి''

ఆమె నొచ్చుకుని, ''మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవడం సరి కాదు'' అంది.

అందం ముందు అహం కూడదన్న బాస్ మాటలు చెవుల్లో మ్రోగాయి. నేను నా ఆర్థిక సాంఘిక పరిస్థితి యథాతథంగా వివరించి, ''నాలోనూ ఔన్నత్యం లేకపోలేదు. అదే నేను అల్పుణ్ణని గుర్తించడం'' అన్నాను.

ఆమె చటుక్కున నా చేతిని తన చేతిలోకి తీసుకుని, ''ఎస్. యు ఆర్ గ్రేట్'' అంది.

వళ్ళు ఝల్లుమనగా, ''థాంక్యూ బాస్'' అనుకున్నాను మనసులో. అనుకున్నానో లేదో బాస్ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆమె వంక అదోలా చూసాడు. నేను తల వంచుకున్నాను. ఆమె ఆయన్ని పట్టించుకోకుండా, ''కంటిన్యూ– మిస్టర్...'' అంది నాతో. బాస్ నిరుత్సాహంగా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

ఉత్సాహంగా నా పేరు చెప్పాను. అప్పుడామె నవ్వి, ''బాసుమతి కోసం పార్టీకొచ్చారు. మీకు భానుమతి దొరికింది. భానుమతి నా పేరులెండి'' అంది. అప్పట్నించి ఇద్దరం చాలా కబుర్లు చెప్పుకున్నాం. మాటల్లో ఎంత దగ్గిరయ్యామంటే ఒకర్నొకరు నువ్వనుకోవడం కూడా మొదలెట్టా. విందు సమయంలో ఆమె నన్ను ఐటమ్స్ దగ్గిరకి తీసుకెళ్ళి బాసుమతి పులావ్ దగ్గిరుండి తనే వడ్డించింది. అప్పుడా పులావ్ రుచే వేరు. పులావ్ తింటున్నప్పుడు నా ఫీలింగ్స్ కనిపెట్టిందో ఏమో, ''నువ్వు నన్ను భానుమతి అనొద్దు. బాసుమతి నీకిష్టం. నన్నూ బాసుమతి అని పిలు'' అందామె. ఆ మాటలకి నా తనువెంత పులకించిందో చెప్పడానికి మాటల్లేవు. పార్టీ అయ్యేక ఆమె నన్ను తన కార్లో మా ఇంటి దగ్గిర దింపుతూ, ''నీకు టైముంటే రేపు మనం శ్రీవాణి పార్కులో కలుసుకుందాం'' అంది. మళ్ళీ నా తనువు అంతలానూ పులకరించింది.

నాకు టైమా, ఆమె కోసం ఆఫీసుకి సెలవైనా పెట్టగలను.

మా పరిచయం దినదినాభివృద్ధి చెందుతుంటే– క్రమంగా ఆమె విశేషాలు తెలుస్తున్నాయి. ఆరేళ్ళక్రితం దాకా ఆమెదీ నాకులా మధ్య తరగతనీ, పెళ్ళయ్యేక హోదా మారిందనీ మొదటిరోజు. భర్తది నడమంత్రపు



సిరి అనీ, ఆయన శాడిస్ట్ కాకపోయినా అహంకారి అనీ రెండోరోజు. భార్యని షో కేసులో బొమ్మలా చూస్తాడనీ, తనకి భార్యగా తప్ప వేరే వ్యక్తిత్వమామెకుండాలనుకోడనీ మూడోరోజు. ఏడాదిలోనే అతడి తత్వాన్ని కనిపెట్టి అతడిలో మార్పుకోసం శతవిధాల ప్రయత్నించిందనీ, చివరికి అతడిలో మార్పొచ్చేదాకా పిల్లలొద్దనుకుందనీ– నాలుగోరోజు. అతడి అంశతో పిల్లలు పుడితే భరించలేననీ– అవసరమైతే ఆ సమస్యా పరిష్కారానికి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవాలనుకుంటోందనీ ఐదోరోజు.

ఆమె ఇంచుమించు లైన్లోకొచ్చినట్లే. ఆరో రోజు ఏం ప్రతిపాదిస్తుందోనని ఉత్సాహపడితే, ''నా కాళ్ళమీద నిలబడాలని పరీక్షలకి కట్టాను. నా చదువు పూర్తయింది. ఇప్పుడు నా భర్తకి విడాకులిచ్చి కొత్త జీవితం ప్రారంభిస్తాను. కొత్త ఆశలు చిగురింపజేసిన నీ స్నేహం ఒంటరినన్న భయాన్ని పోగొట్టింది'' అందామె.

తెల్లబోయాను. నాకు పెళ్ళయ్యేదాకా పెళ్ళైన ఆడదాని పొందు కోరుకున్నాను కానీ, పెళ్ళైన ఆడదాన్ని పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం నాకు లేదు. బాస్ చెప్పిన ఉపాయమిలా బెడిసి కొట్టేసరికి ఏదో నీరసభావం. కానీ ఇంత కథ నడిపేక ఇపుడు బయటపడకూడదని లేని ఉత్సాహం నటించి ఆమె నిర్ణయాన్నభినందించాను. ఐతే రేపట్నించి ఆమెని కలుసుకోకూడదన్నది నేనప్పటికప్పుడు మనసులో తీసుకున్న గట్టి నిర్ణయం.

***

మర్నాడు నేనూహించని విశేషం జరిగింది. భానుమతి మా ఆఫీసుకొచ్చింది. ఆమెని చూసి స్టాఫంతా గౌరవ సూచకంగా లేచి నిలబడితే ఆశ్చర్యపడి కారణమడిగాను.

''నీకు తెలియదా? ఆమె బాస్ భార్య, భానుమతి. కొన్నాళ్ళిక్కడే ఉద్యోగం చేసి సుమారు మూణ్ణెల్ల క్రితం రిజైన్ చేసింది'' అన్న షాకింగ్ న్యూస్ నాకందే లోగా ఆమె తిన్నగా బాస్ గదికి వెళ్ళింది.

నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఇప్పుడామె బాస్‌కి విడాకులిస్తాననీ, నన్ను పెళ్ళి చేసుకుంటాననీ అంటే– ముందు నా ఉద్యోగం ఊడుతుంది. విషయం తెలిస్తే అమ్మా నాన్నా మొహం తగలేస్తారు. కంగారుగా క్యాబిన్లోకెళ్ళి ఇయర్ ఫోన్ తగిలించుకున్నాను...

***

''నువ్వు నాకు విడాకులిస్తే నలుగురిలో నా పరువేం కావాలి?'' బాస్ వేదన.

''మీరు పరువంటున్నది పరువు కాదు, అహం. ఆ అహం నాకూ ఉంది. నా అహాన్ని దెబ్బ తీయనని మాటిస్తే– ఆ మాట నిలబెట్టుకున్నంత కాలం మీ అహాన్ని నేనూ దెబ్బ తియ్యను'' భానుమతి నిశ్చల స్వరం.

''నన్ను కాదని మన ఆఫీసులో ఓ కోన్ కిస్కాగాణ్ణి పెళ్ళి చేసుకుంటే– నీ అహం దెబ్బ తినదా?'' ఆ కోన్ కిస్కా ఎవరోనన్న అనుమానం లేకుండా నా పేరు కూడా వచ్చింది బాస్ నోటివెంట.

''మిమ్మల్ని తలదన్నినవాళ్ళనే తప్ప కోన్‌కిస్కాల్ని పెళ్ళి చేసుకుంటానని ఎలా అనుకున్నారు? అతడికి నేను భానుమతిని కావడం ఇష్టంలేక బాసుమతి అని పిలవమన్నాను. శ్రీమతి అంటే స్వంత భార్యలాగ బాసుమతి అంటే బాసు భార్య. నేనెప్పటికీ అతడికి బాసుమతినే'' అంటూ నేను కోన్ కిస్కానెందుకయ్యానో వివరణ కూడా ఇచ్చిందామె. ఆడవాళ్ళని వల్లో వేసుకునేందుకు బాస్ వేసే చౌకబారు పద్ధతులే నేనూ అనుసరిస్తానంటూ ఆ పద్ధతులు కూడా చెప్పింది. అప్పుడు ఆమె దగ్గిర నా ప్రవర్తన గుర్తుకి రాగా– ఆమె దృష్టిలో నేనేమిటో అర్థమై సిగ్గుతో కుంచించుకు పోయాను.

''నా ట్రిక్స్ గురించి అతగాడికెలా తెలిసింది?'' బాస్ గొంతులో ఆశ్చర్యం.

''పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ ఎవరూ చూడ్డం లేదనుకుంటే ఎలా? మీ చీప్ ట్రిక్స్ గురించి నాకెలా తెలిసిందో అతడికీ అలాగే తెలిసుంటుంది'' తనకెలా తెలిసిందో చెప్పలేదామె. కానీ నాకు తెలుసు. నాకు తెలుసని ఆమెకీ తెలుసు.

నా చెవిలోంచి ఇయర్ ఫోన్ జారిపడింది.

తర్వాత నేను మళ్ళీ భానుమతిని కలుసుకోలేదు. ఐనా ఆమె ఎప్పటికీ నాకు బాసుమతిగానే కొనసాగింది.

*